

అప్పన్నకు ఆర్జిత సేవలు
విశాఖ: సింహాచలం సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి ఆర్జిత సేవలు ఘనంగా నిర్వహించారు.



రథోత్సవాలకు ఏర్పాట్లు
విశాఖ టౌన్‌కొత్తరోడ్డులో జగన్నాథస్వామి రథోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. 8లో



వెండి పాదుకలకు విరాళం
విశాఖ సీలానగర్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి వెండి పాదుకలకు భక్తులు విరాళం అందజేశారు. 8లో

న్యూస్‌రీల్

గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడు



విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

మహారాణిపేట (విశాఖ) : గిరిజనుల హక్కుల సాధనకు పోరాడిన యోధుడు అల్లూరి అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటం వద్ద సుభద్ర నివాళి అర్పించారు. గిరిజనులను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాటం చేశారని కొనియాడారు. జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ వారిపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అల్లూరి అన్నారు. అందరికీ సమాన హక్కులు ఉండాలని ఆయన కోరుకున్నారన్నారు.డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, విశ్రాంత పరిపాలనాధికారి పీవీఎస్ శర్మ పాల్గొన్నారు.

జీసీసీ గోదాం తనిఖీ



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న పాడేరు జీసీసీ డీఎం సింహాచలం

జి.మాడుగుల: మండల కేంద్రంలో జీసీసీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాక్ పాయింట్ గోదాం(ఎంఎల్ఎస్)ను పాడేరు జీసీసీ డివిజనల్ మేనేజర్ డి. సింహాచలం గురువారం తనిఖీ చేశారు. గోదాంలో బియ్యం బస్తాలను లెక్కించారు. రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలు సక్రమంగా ఉన్నందున ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ కొండబాబు, గోదాం సూపరింటెండెంట్ మత్స్యరాస సింహాచలంరాజు పాల్గొన్నారు.

చింతూరులో ఎంఎల్ఎస్ పాయింట్..

చింతూరు: స్థానిక జీసీసీకి చెందిన ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వరదలకు ముందుగానే బఫర్‌స్టాకును ఆయా మండలాలకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు. రికార్డులు పరిశీలించిన ఆమె నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.

మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలి

- జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రంపచోడవరం: గిరిజన మత్స్యకారులు తమ సంఘాలను సక్రమంగా నిర్వహించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా మత్స్యశాఖాధికారి డా. పి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నేటకోట గిరిజన మత్స్యకార సంఘాన్ని ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్‌గా మార్పు చేసేందుకు సంఘం సభ్యులకు గురువారం పందిరిమామిడి మత్స్యశాఖ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు యాజమాన్యంతోపాటు చేపల పెంపకం, సొసైటీల రికార్డుల నిర్వహణ, నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. గిరిజన మత్స్యకారులను మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ రమేష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.బాలాజీ, సత్యవేణి, సత్యవతి,శివసాయి పాల్గొన్నారు.

గిరిజనులకు మత్స్యసిరి



వలకు చిక్కిన పది కిలోల చేపను మోసుకొని వస్తున్న మత్స్యకారులు

ముంచంగిపుట్టు : ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గిరిజన మత్స్యకారుల వలకు భారీ సైజు చేపలు చిక్కుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలో వరదనీరు చేరడంతో చేపల వేట మొదలు పెట్టారు. దీనిలో భాగంగా ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన ఓనమాల్ వద్ద మత్స్యగెడ్డలో గురువారం పది నుంచి 12 కిలోల గల బంగారు పాప రకం చేపలు చిక్కాయి. వీటిని కిలో రూ.200 చొప్పున ఒనకడిల్లీ వారపు సంతలో విక్రయించారు.

అల్లూరి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి

- ఐటీడీఏల లక్ష్యం నెరవేర్చాలి
- విద్యార్థులకు యోగా శిక్షణ
- జిల్లాలో 1645 గ్రామాలకు రహదారి సౌకర్యం
- జయంతి వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి
- వాడవాడలా పండగలా నిర్వహణ



పాడేరులోని కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎంపీ తనూజారాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం

సాక్షి,పాడేరు: స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషిచేద్దామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం అల్లూరి 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కలెక్టర్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రి రెడ్డి, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి పేరుతో ఏర్పడిన జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావించి గిరిజన ప్రజలకు సేవలు అందించాలని కోరారు. అదే లక్ష్యంతో ఐటీడీఏలు ఏర్పడ్డాయని, ప్రాజెక్టు అధికారులంతా వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థుల్లో సిగ్గు, బిడియం పారదోలేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రంపచోడవరానికి చెందిన 40 మంది విద్యార్థులు బెంగళూరులో నిర్వహించిన యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. అక్కడి మాదిరిగానే విద్యార్థులకు యోగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 1422 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామని మరో 978 గ్రామాలకు నిర్మించాల్సి ఉందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 223 గ్రామాలకు రోడ్లు నిర్మించగా మరో 323 గ్రామాలకు నిర్మించాల్సి ఉందన్నారు.

మహనీయుడు అల్లూరి

అల్లూరి జీవించిన కాలం తక్కువే అయినప్పటికి కీర్తి ప్రతిష్టలతో దేశవ్యాప్తంగా పేరొందిన మహనీయుడని, ఆయన స్ఫూర్తితో గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో అభిషేక్ పేర్కొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

పోరాటాల ద్వారానే హక్కులు సాధించవచ్చని అల్లూరి నిరూపించారని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి అన్నారు. ఆయన స్ఫూర్తితో తాను పార్లమెంట్ సభ్యురాలిగా గిరిజన ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారానికి, ఆదివాసీల హక్కులు, చట్టాలు పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు.అల్లూరి సాయుధ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని పాడేరు నియోజకవర్గ సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

సేవలు చిరస్మరణీయం

అల్లూరి పోరాటం గొప్ప చరిత్ర అని, ఆయన సేవలు చిరస్మరణీయమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడి వారిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

అలరించిన నృత్యాలు

అల్లూరి జయంతి పురస్కరించుకుని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీటిలో అల్లూరి పోరాటానికి సంబంధించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్,ఉపన్యాస పోటీల్లో విజేతలకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, డీడీ కొండలరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం చిరస్మరణీయం

రంపచోడవరం: అల్లూరి పోరాటం చిరస్మరణీయమని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చింతూరు: అల్లూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలనిజాయింట్ కలెక్టర్ భావన వశిష్ట కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాయంలో పీవో కావూరి చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీఆర్‌పురం మండలం ప్రత్తిపాకకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు శ్యామల వెంకటరామయ్యను సత్కరించారు.



కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం



చింతూరు ఐటీడీఏలో నివాళులర్పిస్తున్న జేసీ భావన వశిష్ట



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి



రంపచోడవరం ఐటీడీఏలో నివాళులర్పిస్తున్న పీవో సూరజ్‌గనోరే



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



పాడేరు కలెక్టరేట్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

మేమింతే.. మారమంతే!

- ఇష్టారాజ్యంగా జోలాపుట్టులో సివిల్ ప్రాజెక్టు ఈఈ కార్యాలయ ఉద్యోగుల తీరు
- విధులకు డుమ్మా కొడుతున్నా చర్యలు శూన్యం
- నిత్యం ఆఫీసు మూసివేసి ఉండటంపై స్థానికుల ఆగ్రహం
- మీడియాకు ఫొటోలు, వీడియోలు
- బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: ఎస్ఈ ఏవీ సుబ్రమణ్యేశ్వరరావు

ముంచంగిపుట్టు: అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ రెండు జలాశయాలను నిత్యం పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన కార్యాలయం తరచూ మూసి ఉండడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టుతోపాటు ఒడిశా స్పిల్‌వే జలాశయాన్ని పర్యవేక్షించాలనే సంకల్పంతో జోలాపుట్టులో సివిల్ ప్రాజెక్టు ఈఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గతంలో విశేష సేవలందించిన ఇక్కడి ఉద్యోగులు ఇప్పుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. విధులకు వారి ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఈఈ క్యాడర్ గల ఉన్నతాధికారితోపాటు ఏఈ, నలుగురు సిబ్బంది ఉండాలి. వీరు సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంతో ఎప్పుడు చూసినా ఈ కార్యాలయం మూతపడి ఉంటుందని వారు విమర్శిస్తున్నారు. గురువారం కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. ఫొటోలు, వీడియోలు తీసి మీడియాకు అందజేశారు. కార్యాలయంలో ప్రధాన అధికారి ఈఈతోపాటు ఏఈ, సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తారు. దీనిపై మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎస్ఈ ఏవీ సుబ్రమణ్యేశ్వరరావును వివరణ కోరగా కార్యాలయం మూతపడి ఉండటానికి సంబంధించి వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జోలాపుట్టులో గురువారం మూసి ఉన్న సివిల్ ఈఈ కార్యాలయం

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఎస్పీ తుహిన్ సిన్హా

అనంతగిరి: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా ఫిర్యాదులను స్వీకరించాలని, వాటిపై సత్వరం స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటకుల ముసుగులో గంజాయి రవాణా చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గంజాయి రవాణా అరికట్టేందుకు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గిరిజన యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతీ, యువకులు ఉపాధిమార్గాలపై ప్రత్యేక దృష్టిసారించి, కుటుంబాలకు అండగా ఉండాలని సూచించారు. చెడువ్యసనాల కారణంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో స్థానిక ఎస్ఐ కరక రాము అందించిన సేవలను ఎస్పీ అభినందించారు. అరకు సీఐ రుద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

మెన్‌స్ట్రువల్ కప్స్‌పై అవగాహన అవసరం

కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు: మహిళలకు మెన్‌స్ట్రువల్ కప్స్ వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ పీవో కావూరి చైతన్యతో కలసి ఆయన మహిళలకు మెన్స్ట్రూవల్స్ కప్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం చింతూరు ఐటీడీఏ పరిధిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ పీవో కావూరి చైతన్యను ఆయన అభినందించారు. ప్రకృతి ధర్మంలో భాగంగా మహిళలకు ప్రతినెలా సంభవించే నెలసరిపై ఏజెన్సీ ప్రాంతంలోని మహిళలకు సరైన అవగాహన లేక ఎన్నో ఇబ్బందుల పడుతుంటారన్నారు. శానిటరీ ప్యాడ్స్ కొనుగోలుకు ఆర్థికంగా ఎంతో ఖర్చవుతుందని ఆయన తెలిపారు. దీనిని నివారించేందుకు అధునాతనమైన మెన్‌స్ట్రువల్ కప్స్ బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు లభిస్తున్నాయని, మహిళలు వీటిని వినియోగించాలని ఆయన సూచించారు. వీటి వినయోగంపై స్త్రీల వైద్య నిపుణులతో ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీసీహెచ్‌ఎస్ కృష్ణారావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహిళలకు మెన్‌స్ట్రువల్ కప్స్‌ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ భావన వశిష్ట

గిరిజనుల జీవన ప్రమాణాల పెంపులో

కేవీకేల పాత్ర కీలకం

- డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు కరుణశ్రీ
- పందిరిమామిడి కేవీకేలో ఘనంగా స్వర్ణోత్సవాలు

రంపచోడవరం: గిరిజనుల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలకపాత్ర పోషించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా.కరుణశ్రీ కోరారు. పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం కోఆర్డినేటర్ డాక్టర్ లలిత కామేశ్వరి అధ్యక్షతన జరిగిన కేవీకేల స్వర్ణోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 50 ఏళ్ల సంబరాలుకు సంబంధించిన కొన్ని తీర్మానాలు చేసుకోవాలని సూచించారు. జాఫ్రాకు మెరుగైన మార్కెటింగ్ కల్పించేందుకు ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి చేస్తుందన్నారు. లలితకామేశ్వరి మాట్లాడుతూ దేశం మొత్తం మీద 750 కేవీకేలు ఉన్నాయన్నారు. రైతులకు అధునిక శాస్త్ర, సాంకేతిక, మేలైన దిగుబడుల సాధనకు తోడ్పాటు అందించేందుకు పుదుచ్చేరిలో కేవీకే స్థాపించి 50 ఏళ్లు పూర్తయిందన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురించి వివరించారు. వసంతాల జ్యోతిని ఢిల్లీకి వెళ్లే కార్యక్రమంలో రైతులు పాల్గొనాలని కోరారు. ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డా. కె రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేవీకే ద్వారా ఏజెన్సీలో గిరిజన రైతులకు అనేక సేవలు అందుతున్నాయని తెలిపారు. రబ్బరు రైతులకు అందిస్తున్న సేవలను శాస్త్రవేత్త డా. టి క్రాంతికుమార్ వివరించారు. శాస్త్రవేత్తలు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు చిరుధాన్యాల విత్తనాలు , రబ్బరు టాపింగ్ చేసే పరికరాలను అందజేశారు.



రైతులకు విత్తనాల పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

మత్స్యకారులకు బాసట

గిరిజన మత్స్యకారులు మత్స్యశాఖ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. చేప పిల్లల పంపిణీ దగ్గర నుంచి యాజమాన్యం, పెంపకంలో మెలకులపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు వారికి ఎంతగానో దోహదపడుతున్నాయి.

- ఏటా 12 లక్షల చేప పిల్లల పంపిణీ
- రూ.12 లక్షలు వెచ్చిస్తున్న మత్స్యశాఖ
- 669.33 హెక్టార్లలో పెంపకం
- 650 కుటుంబాలకు ఉపాధి
- సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి



రంపచోడవరం మండలం పందిరిమామిడిలో చేప పిల్లల పెంపక కుండీలు

సాక్షి, పాడేరు: జిల్లాలో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్న గిరిజన మత్స్యకారులకు మత్స్యశాఖ సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తోంది. వారి జీవనోపాధికి బాటలు వేస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తోంది. ఏటా 12 లక్షల చేప పిల్లలను పెంచుతూ మత్స్యకారులు ఆధారపడిన 18 పెద్ద చెరువుల్లో విడుదల చేస్తోంది. వీటి పెంపకం ద్వారా వారు మంచి ఆదాయం పొందుతున్నారు.

చేప పిల్లకు ఒక్క రూపాయి చొప్పున..

చేప పిల్లకు రూపాయి చొప్పున రూ.12 లక్షల నిధులను ఖర్చు చేస్తోంది. వీటిలో మార్కెట్లో గిరాకీ ఉన్న శీలావతి, బొచ్చు రకాలకు ప్రాధాన్యమిస్తోంది. ఈ ఏడాది 12 లక్షల చేప పిల్లల పెంపకానికి ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా రంపచోడవరం మండలంలోని పందిరిమామిడి, రాజవొమ్మంగి ప్రాంతాల్లో మత్స్యశాఖకు చెందిన చేపపిల్లల పెంపక కేంద్రాలను సిద్ధం చేసింది. కడియంలోని ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి క్షేత్రం నుంచి తీసుకురానున్నట్టు మత్స్యశాఖ అధికారవర్గాలు తెలిపాయి. గిరిజన సొసైటీలకు సెప్టెంబర్, అక్టోబర్‌లో చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు.

మత్స్యకార సొసైటీల ఆధ్వర్యంలో..

జిల్లావ్యాప్తంగా గుర్తించిన 18 పెద్ద చెరువుల్లో సుమారు 669.33 హెక్టార్ల విస్తీర్ణంలో చేపల పెంపకానికి అవసరమైన పిల్లలను మత్స్యశాఖ సరఫరా చేస్తోంది. వీటి పరిధిలో మత్స్యకార సొసైటీలను ఏర్పాటుచేసిన మత్స్యశాఖ.. చేపల పెంపకం ద్వారా 650 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది.





గతేడాది గిరిజన మత్స్యకారులకు సంచులతో చేప పిల్లల పంపిణీ (ఇన్‌సెట్) చేప పిల్లలు

చేపల పెంపకం జరిగే ప్రాంతాలు

రంపచోడవరం: మండలంలో భూపతిపాలెం రిజర్వాయర్ (150 హెక్టార్లు), ముసురుమిల్లి రిజర్వాయర్ (180 హెక్టార్లు), దెయ్యాలగుమ్మి (20 హెక్టార్లు)

అడ్డతీగల: మండలంలో మద్దిగెడ్డ రిజర్వాయర్ (40 హెక్టార్లు), దొరచెరువు (7 హెక్టార్లు)

గంగవరం: మండలంలో సూరంపాలెం రిజర్వాయర్ (40 హెక్టార్లు), వెంకటపతిరాజు చెరువు (6 హెక్టార్లు).

రాజవొమ్మంగి: మండలంలో ఒట్టిగెడ్డ జలాశయం (32 హెక్టార్లు), మంగలి గెడ్డ జలాశయం (16 హెక్టార్లు), కోలగుమ్మి రిజర్వాయర్ (8 హెక్టార్లు), గింజర్తి చెరువులో (17 హెక్టార్లు), బండకొండ చెరువులో (20 హెక్టార్లు).

దేవీపట్నం: మండలంలో నేలకోట ఆవ (70 హెక్టార్లు)

కొయ్యూరు: మండలంలో మల్లవరం రిజర్వాయర్ (4.58 హెక్టార్లు), కాంబులగెడ్డ రిజర్వాయర్ (13 హెక్టార్లు), గింజర్తి రిజర్వాయర్ (9 హెక్టార్లు)చింతపల్లి: మండలంలో పొట్టిపిట్ట వాగు రిజర్వాయర్ (6 హెక్టార్లు), తాజంగి జలాశయం (30.75 హెక్టార్లు).

మంచి ఆదాయం పొందేలా సహకారం



చేపల పెంపకంతో మంచి ఆదాయం పొందేలా ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తున్నాం. దీనిలో భాగంగా గిరిజన మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నాం. ఇందుకు రూ.12 లక్షల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన పేర్కొన్నారు. సుమారు 650 కుటుంబాలకు మేలు చేకూరుతోంది.

– పి.శ్రీనివాసరావు,
జిల్లా మత్స్యశాఖ అధికారి, పాడేరు

క్లుప్తంగా

గణాంక అధికారికి ఏపీఆర్వోగా అదనపు బాధ్యతలు

చింతూరు: స్థానిక ఐటీడీఏలో గణాంక అధికారి భాస్కరరావుకు ఏపీఆర్వోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇకపై ఐటీడీఏ కార్యకలాపాలకు సంబంధించిన సమావేశాలు, కాన్ఫరెన్సులు, అధికారుల పర్యటనల వివరాలను ఆయన మీడియాకు తెలియజేస్తారని పీవో ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వెండి పాదుకలకు విరాళం

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన తిరుమల బాలాజీకి వెండి పాదుకల నిమిత్తం ఏలూరుకు చెందిన వంకినేని పిచ్చయ్య చౌదరి, కనకలక్ష్మి దంపతులు రూ.52 వేల విరాళాన్ని అందజేశారు. గురువారం శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ట్రస్ట్ ప్రతినిధుల సమక్షంలో ఆలయ అర్చకులకు నగదును అందజేశారు.

145 మందికి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు

పెదబయలు: పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మగవారికి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలను ఆపరేషన్లు జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆధునిక పద్ధతుల ద్వారా శరీరంపై ఎటువంటి కోత లేకుండా, నొప్పి లేకుండా శస్త్ర చికిత్స చేస్తున్నట్టు తెలిపారు. పీహెచ్‌సీలో 145 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స చేశామని, ఒక్కో వ్యక్తికి రూ.1100 అందజేస్తున్నట్టు చెప్పారు. వైద్యులు శివప్రసాద్, లక్ష్మీకాంత్, షేక్ శివప్రసాద్, హిమ బిందు, చైతన్య, సందీప్, వైద్యాధికారి నిఖిల్, సత్యశ్రీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరదల సమయంలో సూచనలు పాటించాలి

వీఆర్ పురం: వరదలు సమయంలో అధికారులు ఇచ్చే సూచనలను గ్రామస్తులు తప్పకుండా పాటించి వారికి సహకరించాలని తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్ అన్నారు. గోదావరి పరివాహక గ్రామమైన వడ్డిగూడెం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వరద సమయాల్లో బాధితులను పునరావాస కేంద్రానికి తరలిస్తామన్నారు. డీటీ రామకృష్ణ, సర్పంచ్ సోడె నరసమ్మ, పంచాయతీ కార్యదర్శి స్వరూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామారావు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పుడమికి జీవం.. పైరుకు ప్రాణం

నేల సారాన్ని పెంచడానికి లేదా మొక్కలకు పోషకాలను అందించడానికి జీవ ఎరువులు ప్రధానం.. వీటితో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ.. రైతుకు పెట్టుబడులు భారం లేకుండా అధిక దిగుబడి పొందవచ్చు. ఇవి పొడి, ద్రవ రూపంలో అన్ని రకాల పంటలకు వాడవచ్చు. అతి తక్కువ ధరకు అందించేందుకు ఆర్‌ఏఆర్ఎస్ అందుబాటులోకి తీసుకొచ్చింది.





జీవ ఎరువులు

- జీవ ఎరువులతో అధిక దిగుబడి
- తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఆర్‌ఏఆర్ఎస్
- మొక్కల పెరుగుదలకు పోషకాలు, హార్మోన్లు
- 25 శాతం వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గుదల
- ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీకు ఏర్పాట్లు



జీవ ఎరువులు

సాక్షి, అనకాపల్లి: జీవ ఎరువుల తయారీ కేంద్రాలను అనకాపల్లి ఆర్‌ఏఆర్ఎస్(ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం) ఏర్పాటు చేసింది. వీటి వినియోగంతో ఒక వైపు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు మరోవైపు రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. జీవ ఎరువులో ప్రధానంగా నత్రజని, భాస్వరం, పోటాషియం, జింక్‌లు లభ్యమవుతాయి. రైతులకు వీటి వినియోగం, కలిగే ఉపయోగాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

మొక్కలకు పోషకాలు..

జీవ ఎరువులనేవి మొక్కలకు పోషక పదార్థాలను, మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే హార్మోన్లను సమకూర్చుతోంది. వాతావరణంలో చాలా మొత్తంలో (78 శాతం) నత్రజని ఉంటుంది. వాటిని మొక్కలు సంగ్రహించలేని పరిస్థితిలో ఉంటాయి. జీవ ఎరువుల ద్వారా మొక్కలో ఉండాల్సిన నత్రజనిని అందించడం, అదేవిధంగా నేలలో మొక్క తీసుకోలేని భాస్వరం, పొటాషియం ఎరువులను అందిస్తాయి. నత్రజని స్థిరీకరించే జీవ ఎరువులు (నైట్రోజన్ ఫిక్సింగ్ బ్యాక్టీరియా), భాస్వరం అందించే జీవ ఎరువులు (ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా), పొటాషియం అందించే జీవ ఎరువులు (పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా), జింక్ అందించే జీవ ఎరువులు (జింక్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా)లన్నీ జీవ ఎరువుల్లో లభ్యమై ఉంటాయి.

జీవ ఎరువులు వాడుకొనే విధానం...

1)రైజోబియం జీవ ఎరువులు...

విత్తన శుద్ధిలో భాగంగా కిలో విత్తనాలను 10 గ్రాముల పొడి రూపంలో జీవ ఎరువు (లేదా) 10 మి.లీ. ద్రవరూప జీవ ఎరువులతో విత్తనశుద్ధి చేసుకోవాలి. 200 గ్రాముల రైజోబియం జీవ ఎరువును ఎకరా పొలానికి కావాల్సిన విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి చేయడానికి 50 గ్రాముల బెల్లం లేదా పంచదార లేదా గంబీ పొడర్‌ను కలిపి 10 -15 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. ఈ ద్రావణాన్ని ఎకరానికి కావాల్సిన విత్తనంపై చల్లి దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టూ పొరల ఏర్పడేటట్లు చూడాలి. కల్చర్ పట్టించిన విత్తనాన్ని నీడలో ఆరబెట్టి వెంటనే విత్తుకోవాలి. ఈ రైజోబియం జీవ ఎరువులను పంట మార్పిడి పద్ధతిలోను, అధిక ఆమ్ల/క్షార భూములలోను, మురుగు నీరు నిల్వ ఉన్నప్పుడు, అధిక ఉష్ణోగ్రత ప్రాంతాలలో వినియోగించాలి. విత్తన శుద్ధి చేసుకోవడం వీలుకానప్పుడు నాటే ముందు ఎకరానికి రెండు కిలోల కల్చర్ ఎరువులో కలుపుకొని వాడుకోవచ్చు.

2) అజోస్పైరిల్లమ్,

అజోటోబాక్టర్, ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా, పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా జీవ ఎరువులను విత్తన శుద్ధి, నారుమడి/దుంప శుద్ధి, నేలపై వెదజల్లుట ద్వారా వినియోగించుకోవచ్చును. విత్తనశుద్ధిలో కిలో విత్తనానికి 10 గ్రాముల కల్చర్ వాడుకోవాలి. నారుమడి శుద్ధిలో 100 లీటర్ల నీటిలో కిలో జీవ ఎరువులను కలుపుకొని ఎకరానికి సరిపడు నారు, దుంప వేర్లను ఈ ద్రావణంలో 10-15 నిమిషాలు సేపు ఉంచి వేసుకొనే 3-4 రోజులు ముందు 2 కిలోల కల్చర్‌ను బాగా చివికిన 100 కిలోల పశువుల ఎరువులో కలుపుకొని, చల్లని ప్రదేశంలో పొరలా వేసుకొని గోనె సంచిలో కప్పుకోవాలి. నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.

అజోటోబాక్టర్, అజోస్పైరిల్లమ్...

సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉన్న నేలల్లో బాగా పని చేస్తుంది. కేవలం నత్రజని స్థిరీకరించడమే కాకుండా హార్మోన్లను, ఎంజైమ్లను విడుదల చేసి మొక్క ఏపుగా పెరగడానికి దోహదపడుతుంది. ఈ సూక్ష్మ జీవులు వేర్లతో సంబంధం లేకుండా స్వతంత్రంగా నేలలో జీవిస్తాయి. అజోస్పైరిల్లమ్ మొక్క వేర్లలోకి చొరబడి జీవిస్తాయి, స్థిరీకరించిన నత్రజని ఎక్కువ శాతం వేర్లు తీసుకొనే అవకాశం ఉంది.

ఫాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా

పంటకు వేసిన భాస్వరం భూమిలో చేరిన కొద్ది రోజులలోనే మొక్కలకు కావాల్సిన హార్మోన్లను రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

పొటాషియం....

పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా(కేఆర్బీ) అనే జీవ ఎరువు భూమిలో మొక్కలకు అందుబాటులో లేని పొటాషియంను సమీకరించి అందుబాటులోకి తీసుకొస్తుంది. పొటాషియం లోపం ఉన్న నేలల్లో, పొటాషియం పోషకం ఎక్కువగా ఉపయోగపడే పంటలకు ఈ జీవ ఎరువు అనువైనది. ఈ జీవ ఎరువుతోనూ సేంద్రియ ఎరువు వాడాలి.

జీవ ఎరువుల ఉపయోగాలు

- పంట దిగుబడులు 10-15 శాతం వరకు పెరుగుతాయి.
- రసాయన ఎరువుల వాడకాన్ని 20-25 శాతం దాక తగ్గించుకోవచ్చు.
- వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు.
- నేల భౌతిక లక్షణాలు మెరుగుబడి భూసారం పెరుగుతుంది.
- తక్కువ ధరలలో లభ్యమై, రైతులకు రసాయన ఎరువుల ఖర్చు తగ్గిస్తాయి.
- సూక్ష్మదాతు పోషక లోపాలు రాకుండా నివారిస్తాయి.
- హార్మోన్లు, విటమిన్లు మొక్కలకు లభ్యమయి ఆరోగ్యంగా పెరుగుదల జరుగుతుంది.
- నేల గుల్లబారి వేర్లు బాగా లోపలికి చొచ్చుకుపోయి పోషకాలు ఎక్కువ గ్రహించడానికి ఉపయోగపడతాయి.
- నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంత మేరకు అరికట్టవచ్చు. ఈ జీవ ఎరువులు అన్ని పంటలకు వాడుకోవచ్చు. ఇవి సమర్థవంతంగా జీవ ఎరువులతో తప్పనిసరిగా సేంద్రియ ఎరువును వాడాలి.

జీవ ఎరువుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వీటిని రసాయన ఎరువులలో కలిపి వాడకూడదు. ఎండ తగలని చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.
- నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి
- జీవ ఎరువులను ప్యాకెట్‌పై ఉన్న గడువులోపే వాడాలి.
- నాణ్యత గల కల్చర్‌ను మాత్రమే వాడాలి.
- రసాయనాలతో విత్తనశుద్ధి చేసుకునేటప్పుడు విధిగా 24-28 గంటల వ్యవధి ఉండాలి
- నాణ్యత కలిగిన జీవ ఎరువులను ప్రభుత్వరంగ సంస్థలు లేదా నమ్మకమైన ప్రైవేటు సంస్థల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.

రైతుకు లాభసాటిగా..



జీవ ఎరువులు వాడకం రైతుకు లాభసాటిగా ఉంటుంది. ఈ ఎరువును ఎలా ఉపయోగించాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తాం. ప్రతీ రైతుకు జీవ ఎరువుల ఉపయోగం తెలుసుకోవాలి. రైతుకు పెట్టుబడి భారం ఉండకూడదనే ఆర్‌ఏఆర్ఎస్ అందుబాటులోకి జీవ ఎరువులను తీసుకొచ్చాం.

– డాక్టర్ ముకుందరావు, ఏడీఆర్,

రథోత్సవాలకు ఏర్పాట్లు

దాబాగార్డెన్స్ (విశాఖ): టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 6న సాయంత్రం నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు. 7న సాయంత్రం 4.15 గంటలకు తొలి రథయాత్రను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం టౌన్‌కొత్తరోడ్డు నుంచి టర్నర్ సత్రం వరకు యాత్ర సాగనుందని, 8 నుంచి స్వామి దశవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని చెప్పారు. 18న తిరుగు రథయాత్ర ఉంటుందని, సింహాచలం, కూర్మనాథ ఆలయం, రామతీర్థం నుంచి స్వామికి పట్టు వస్త్రాలు నృసింహ, కూర్మ, రామావతారం రోజుల్లో అందజేస్తారని చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు మాట్లాడుతూ రథయాత్రను పురస్కరించుకొని ప్రతిరోజూ మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సుమారు 3 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకోనున్నారని తెలిపారు. సమావేశంలో అర్చకులు పి.రంగనాథాచార్యులు, యేడిద సురేష్‌బాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీ మోహన్‌రావు

అరకులోయటౌన్: గిరిరైతులకు ఆర్థిక బాసటగా పసుపు నిలుస్తుందని అరకులోయ వ్యవసాయశాఖ ఏడీ మోహన్‌రావు అన్నారు. మిర్చా ప్రాజెక్టులో భాగంగా బుధవారం అరకులోయలో ఉద్యానవన శాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థల ఆధ్వర్యంలో పసుపు, కొబ్బరి, కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై చేసిన వీడియోలను వ్యవసాయ, ఉద్యాన వనశాఖ సిబ్బంది, గిరిరైతుల ఉత్పత్తి దారుల సంఘాల ప్రతినిధులకు వివనిం,ఆరు. ఏడీ మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా ఏజెన్సీలో పండించే పసుపులో ఔషధ గుణాలు అధిక శాతంలో ఉన్నాయన్నారు. అయితే దిగుబడులు తక్కువ శాతంలో ఉండటం వలన గిరిరైతులు ప్రయోజనం పొందలేకపోతున్నారన్నారు. పసుపు సాగులో యాజమన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయన్నారు.శాస్త్రవేత బాబు, వ్యవసాయ శాఖ అధికారులు నీలవేణి, ఫణిరాజ్, ఉద్యానవన అధికారి శిరీషా, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ క్షేత్రస్థాయి అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం వేగవంతం

- ఈ నెల 20 కల్లా పూర్తి చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఈనెల 20 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు, ఎంపీడీవోలు, ఏపీఎంలతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన లక్ష్యాలపై సమీక్షించారు.ఈనెల 10వతేదీ లోగా గోతులు తీసి, వెంటనే మొక్కలు నాటే పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మొక్కల సైజును పరిశీలించాలన్నారు. నాణ్యత లోపాలతో మొక్కలను పంపించే నర్సరీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. ఆపరేషన్ పరివర్తనలో గంజాయి సాగు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించి మొక్కలను పోలీసుశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయాలని సూచించారు. ఒడిశా, మహారాష్ట్ర నుంచి మొక్కలు తీసుకువచ్చే అవకాశాలను పరిశీలించాలని కోరారు. మొక్కల పెంపకం, సరఫరాకు సంబంధించి రంపచోడవరం,పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, అభిషేక్, చైతన్య నివేదించారు.

అనధికార రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే చర్యలు

జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ మినహా అనధికారికంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు.గురువారం ఆయన రెడ్‌క్రాస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు.మైదాన ప్రాంతానికి చెందిన రక్తసేకరణ సంస్థలు గిరిజన ప్రాంతాల్లో రక్త సేకరణ శిబిరాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని,చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.చింతూరులో ఉన్న పాత రెడ్‌క్రాస్ భవనాన్ని మరమ్మతులు చేస్తామన్నారు.పాడేరు,రంపచోడవరం, చింతూరులో జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేస్తామన్నారు.రక్తదాతలను గుర్తించి,ప్రజలను చైతన్య పరచాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రక్తదాన శిబిరాలు నిర్వహించి, అవసరమైన రక్తం నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సూర్యారావు, జయలక్ష్మి, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

260 కేజీల గంజాయి స్వాధీనం

ఎనిమిది మంది అరెస్టు, 2 కార్లు స్వాధీనం

చింతూరు: ఒడిశా నుంచి తెలంగాణకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఆరుగురు నిందితులను గురువారం చింతూరు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా తారసపడిన రెండు కార్లను ఆపి సోదాలు చేయగా, వాటిలో వంద కిలోల గంజాయి లభ్యమైంది. రెండు కార్లలోని నలుగురు వ్యక్తులను, వీరికి పైలట్‌గా ద్విచక్ర వాహనంపై వచ్చిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాకు పాల్పడుతున్న తెలంగాణకు చెందిన హవవత్ రమేష్, జాటోతు రవీందర్, ఒడిశాకు చెందిన మరిగెల వెంకట్రావు, మరిగెల సత్తిరెడ్డి, మరిగెల చంటిబాబు, ప్రకాశం జిల్లాకు చెందిన మాదాల వెంకటేశ్వరరావును అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందన్నారు.

మోతుగూడెం: ఎస్పీ తుహిన్ సిన్హా, చింతూరు సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏఎస్పీ కె.వి మహేశ్వర్ రెడ్డి, చింతూరు సీఐ ఎం. గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు డొంకరాయి పోలీస్ స్టేషన్ ఎదురుగా చెక్ పోస్ట్ వద్ద గురువారం ఎస్సై శివకుమార్ గంజాయి పట్టుకున్నారు. తన సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా, రూ. 8 లక్షల విలువైన 160 కేజీల గంజాయిని రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన షేక్ అక్బర్, హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాజావలి నాలుగు రోజుల క్రితం భద్రాచలంలో ప్రయాణికులను ఎక్కించుకుని సీలేరులో దింపారు. అక్కడ నాలుగు రోజులు జల్సాగా తిరిగిన నిందితుల వద్దకు ఒక వ్యక్తి వచ్చి గంజాయి భద్రాచలం తీసుకెళ్తే రూ.30 వేల కిరాయిస్తామని చెప్పడంతో, రెండు ఆటోల్లో 80 కేజీల చొప్పున గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారు. గెజిటెడ్ అధికారి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకట నానాజీ , మధ్యవర్తులైన వీఆర్వో సందీప్ ఆచార్యులు, సురేష్‌ల సమక్షంలో 160 కేజీల గంజాయిని సీజ్ చేసి షేక్ అక్బర్, షేక్ ఖాజావలిలను అరెస్ట్ చేశారు. చింతూరు సీఐ గంజేంద్ర కుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వద్దకు రిమాండ్ నిమిత్తం తరలించారు.



చింతూరులో స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు



మోతుగూడెంలోని పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

జిప్‌లైన్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు డిమాండ్

అనంతగిరి: బొర్రా గుహలు వద్ద నిబంధనలకు విరుద్ధంగా జిప్‌లైన్‌ను నిర్వహించిన ప్రైవేట్ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ గంగరాజు డిమాండ్ చేశారు. పర్యాటకశాఖ పేరుతో ప్రైవేటు వ్యక్తి నిర్వహిస్తున్న జిప్‌లైన్‌ను అనుమతులు లేకపోవడంతో నిలిచిపోవడం తెలిసిందే. దీనిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ, పీసా అనుమతులు లేకుండా తొమ్మిది నెలలపాటు జిప్‌లైన్ ఎలా నిర్వహించారని ప్రశ్నించారు. 1/70 యాక్ట్ తుంగలోతొక్కి, గిరిజనులకు అన్యాయం చేస్తుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భారీ వ్యాపారం జరిగిందని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. జిప్‌లైన్‌ను పర్యాటకశాఖ స్వాధీనం చేసుకుని, నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని, వచ్చిన ఆదాయంలో పంచాయతీ అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలోని టోకూరు సర్పంచ్ మోస్య, గిరిజన యువత పాల్గొన్నారు.



బొర్రాలో జిప్‌లైన్ వద్ద మాట్లాడుతున్న జెడ్పీటీసీ గంగరాజు, టోకూరు సర్పంచ్ మోస్య

'వీఆర్ పురంతో విడదీయరాని బంధం'

- మాజీ మంత్రి జలగం ప్రసాద్‌బాబు

వీఆర్ పురం: వీఆర్ పురం మండలంతో విడదీయరాని బంధం తమ కుటుంబానికి ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి జలగం ప్రసాద్‌బాబు అన్నారు. తన తండ్రి జలగం వెంగళరావు పేరుతో ప్రారంభించిన జేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రేఖపల్లిలో గురువారం రైతులకు రాయితీతో విద్యుత్ మోటార్లు పంపిణీ చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతాంగానికి అతి తక్కువ సబ్సిడీ ధరలకే విద్యుత్ మోటార్లను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాంత గిరిజనులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటాన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ప్రముఖ రైతు మామిడి రాజు, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, నాయకులు శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రేఖపల్లిలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జలగం ప్రసాద్‌బాబు

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

జి.మాడుగుల: గంజాయి సాగు, రవాణా, మధ్యవర్తిత్వం చట్టరీత్యా నేరమని అటువంటి వాటికి గిరిజనులు, దూరంగా ఉండాలని సీఐ రమేష్ తెలిపారు. మండలంలో బొయితిల పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతలో పలు చోట్ల గిరిజనులకు గంజాయి నివారణపై ఆయన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి నిర్మూలనకు పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నామని, అందరు సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అల్లిగూడెంలో చిన్నారులతో ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి



జోలాపుట్టులో విద్యార్థినులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

చింతూరు: అల్లిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రం ద్వారా అందజేస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు గ్రామస్థాయి కమిటీలు ఎంతో ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమాణిక్యం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిడుమూరులో సర్పంచ్ కాక అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 74 మంది విద్యార్థులకు సికెల్‌సెల్ అనీమియా పరీక్షలు చేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఎటువంటి అనారోగ్య సమస్య ఉన్న వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.హెచ్‌ఎం నిర్మల, వార్డెన్ జోసెఫ్, వైద్య సిబ్బంది తులసిరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.